క్లుప్తంగా

నేడు నేదునూరుకు మంత్రి సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో అమేజాన్ సంస్థ సహకారంతో జరిగిన పాఠశాల అభివృద్ధి పనులను ప్రారంభించడానికి శుక్రవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి రానున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పరాభవం తథ్యం

హస్తినాపురం: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రానున్న సాధారణ ఎన్నికలలో ప్రజలు ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని రంగారెడ్డి గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు మాధవరెడ్డి, జీవన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, అరుణసింగ్, శిరీష, శేఖర్‌గౌడ్, రాజవర్ధన్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పద్మానాయక్ తదితరులు

హస్తినాపురం: మద్యం మాదక ద్రవ్యాల నుంచి మన బాలలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్, భూపేష్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. భూపేశ్ గుప్తానగర్ కాలనీలో మద్యం, మాదకద్రవ్యాల నుంచి బాలలను రక్షించుకోవాలని కోరుతూ సీఆర్‌పీఎఫ్ సభ్యులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపీసింగ్‌నాయక్, అరుణ్, శివకుమార్‌రెడ్డి, భీంలాల్, సందీప్, మదర్స్ కమిటీ ప్రతినిధులు సునిత, విజయ, జ్యోతి, మంజుల, ఎంవీ ఫౌండేషన్ మండల ఇంచార్జి వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, అలివేలు, సువర్ణ, సాయిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహం అద్భుత దేవాలయం

మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు



అనాథ విద్యార్థులకు నిత్యావసరాలను అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌రావు

దిల్‌సుఖ్‌నగర్: అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుత దేవాలయం అని, ఉద్యోగులు, స్టాఫ్ లేకుండా విద్యార్థులే అన్ని రకాల బాధ్యతలు నిర్వహిస్తూ, చదువులో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం మంచి పరిణామమని తెలంగాణ రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు గురువారం ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు. గృహ విద్యార్థుల కోరిక మేరకు రూ. 2 లక్షల విలువైన పెద్ద ఫ్రిజ్, కుక్కర్లు, మిక్సర్స్, ఒక పెద్ద స్టవ్, నెలకు సరిపడా బియ్యం, పప్పులు, ఆయిల్ టిన్నులు, షుగర్‌తోపాటు స్కూల్, కళాశాల విద్యార్థులకు బ్యాగులు, షూస్‌లు అందజేశారు. గృహ అధ్యక్షుడు అధ్యక్షుడు మార్గం రాజేష్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, మెడికల్–హెల్త్ జాయింట్ డైరెక్టర్ శశిశ్రీ, డిప్యూటీ డైరెక్టర్ సోమశేఖర్, ఈఎన్‌టీ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవిశంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు పోడు పట్టాల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: జీఓ నంబర్ 59 అమలులో భాగంగా ఆక్రమిత స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను శుక్రవారం లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ అనితారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు పెద్దఅంబర్‌పేటలోని కావేరి గార్డెన్స్‌లో నిర్వహించే సమావేశానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరై పట్టాలు పంపిణీ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

మహేశ్వరం: మండలంలో బక్రీద్‌ను గురువారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈద్గా, దర్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ ముస్లింల ఐక్యతకు బక్రీద్ పండుగ నిదర్శనమని వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ ఎంఏ సమీర్, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అదిల్ అలీ, మైనార్టీ సంఘం మండల అధ్యక్షుడు ఎంఏ ఫరీద్ అన్నారు. శాంతికి చిహ్నం, త్యాగానికి ప్రతీక అన్నారు. సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం సీఐ మధు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జల్‌పల్లి మున్సిపాలిటీలో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో బక్రీద్ పండుగ గురువారం ప్రశాంత వాతావరణంలో సాగింది. ఉదయం నుంచే ముస్లింలు పహాడీషరీఫ్, వాదే ముస్తఫా, వాదే హదీస్, జల్‌పల్లి, కొత్తపేట, షాహిన్‌నగర్ మర్కజ్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఖుర్బానీ కార్యక్రమాలు సాగాయి. ఈద్గాల వద్ద అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మహేశ్వరం ఏసీపీ అంజయ్య పర్యవేక్షణలో పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు కె.సతీష్, బి.వెంకట్‌రెడ్డిలు తగిన బందోబస్తు చేపట్టారు.



జల్‌పల్లి ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కందుకూరు: మహ్మద్‌నగర్‌లో..



తుక్కుగూడ: రావిర్యాల ఈద్గా వద్ద ప్రార్థనలు



కందుకూరు: నేదునూరులో ముస్లింలతో ఎస్‌ఐ శ్రావణ్



నాగారంలో..



కొత్తగూడలో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు



మహేశ్వరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

- మహేశ్వరంలో కాషాయ జెండా ఎగరేస్తాం
- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరాములు

బడంగ్‌పేట్: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ చేపట్టిన ప్రజా జన్ సంపర్క్ అభియాన్ పాదయాత్ర గురువారం ఏడో రోజుకు చేరుకుంది. అల్మాస్‌గూడలోని పలు డివిజన్లల్లోని కాలనీల్లో ఇంటింటికీ తిరిగి మోదీ తొమ్మిదేళ్ల పాలనను ప్రజలకు వివరించారు. సుపరిపాలన, పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్పొరేషన్ కార్మికులు, చిరుద్యోగుల కష్టాలను తెలుసుకుని మీ వెంట మేమున్నామని భరోసా ఇస్తూ ముందుకు సాగారు. ఇంటింటికి నల్లా నీరు అని చెప్పి ప్రజలను మోసం చేస్తున్న ఎమ్మెల్యే రాజీవ్ గృహకల్పలో ప్రారంభానికి నోచుకోకముందే శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని ఇలా వృథా చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో కాషాయ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు రామిడి మాధురి, పద్మ, సునీత, లక్ష్మారెడ్డి, రమాదేవి, ఇంద్రాసేనా, అనిత, శంకర్, మహిళా అధ్యక్షురాలు మమత పాల్గొన్నారు.

చంద్రయ్యకు మాజీ ఎంపీ పరామర్శ

ఇబ్రహీంపట్నం: అస్వస్థతకు గురైన ఖానాపూర్ గ్రామానికి చెందిన చంద్రయ్యగౌడ్‌ను మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ గురువారం కలిసి పరామర్శించారు. ఇబ్రహీంపట్నంలోని చంద్రయ్య నివాసానికి మాజీ ఎంపీ వచ్చి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని అందుకు తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

భక్తజన సందడి

- ఘనంగా తొలి ఏకాదశి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పహాడీషరీఫ్: భక్తులతో సందడిగా బాలాజీ ఆలయం

పహాడీషరీఫ్: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు యు.సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పహాడీషరీఫ్, జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, కాటేదాన్, శంషాబాద్, బేగంబజార్‌ల భక్తులు భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కొలువుదీరిన ఈ ఆలయానికి విచ్చేసిన భక్తులు సరదాగా గడిపారు. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నిమ్మల నరేందర్ గౌడ్, చైర్మన్ కోట్ల వెంకటేశ్, ఈవో మురళీ కృష్ణ, పాలక మండలి సభ్యులు ఈసంపల్లి పద్మ శంకర్ గౌడ్, పెండ్యాల కృష్ణనాయి, సద్ది సహదేవ్, గౌండ్యాల అశోక్ ముదిరాజ్‌లు తగిన ఏర్పాట్లు చేశారు.

వైభవంగా తొలి ఏకాదశి

తుక్కుగూడ: తొలి ఏకాదశి వేడుకలను మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట లక్ష్మీనరిసింహస్వామి ఆలయంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ సుదర్శన నరసింహఇష్టి, తిరుకల్యాణం, అభిషేకాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ జి.శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు..

కందుకూరు: మండల పరిధిలో తొలి ఏకాదశి పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వివిధ గ్రామాల్లోని వైష్ణవ దేవాలయాలైన వేంకటేశ్వరస్వామి, చెన్నకేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భజనలు, స్వామి వారి కీర్తనలను ఆలపించారు.

సత్వర సేవలు

సత్ఫలితాలనిస్తున్న వార్డు కార్యాలయాలు

- ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణ
- 24గంటల్లో సమస్యలకు పరిష్కారం



సరూర్‌నగర్ వార్డు కార్యాలయం

అధికారి పేరు	హోదా	ఫోన్ నంబర్
ఎన్.యాదగిరి	వార్డు ఆఫీసర్	7702774614
ప్రశాంతి	అసిస్టెంట్ ఇంజనీర్	7331189483
కృష్ణయ్య	టీపీఎస్	9000115209
మహేందర్‌రెడ్డి	శానిటరీ జవాన్	9849908090
శోభన	కమ్యూనిటీ ఆర్గనైజర్	9550910536
ఎ.యాదగిరి	శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్	8522938970
స్వప్న	కంప్యూటర్ ఆపరేటర్	7780347962
సాయికిరణ్	అర్బన్ బయో డైవర్సిటీ	8121768656
ఎస్.పాండు	జూనియర్ అసిస్టెంట్	9966445802
ఇసాక్	లైన్ ఇన్స్‌పెక్టర్	8008949657

హుడాకాంప్లెక్స్: సమస్యల సత్వర పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. పరిపాలనలో పారదర్శకతతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వీటిని ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలోని సమస్యలు, సిటిజన్లు అందజేసిన ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం ఈ వార్డు కార్యాలయాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. సరూర్‌నగర్ డివిజన్ మున్సిపల్ ఆఫీసు వెనుక ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మారింది. ఈ నెల 19 నుంచి 29 వరకు 68 ఫిర్యాదులు(మై జీహెచ్ఎంసీ యాప్ ద్వారా 30, కాల్ సెంటర్ ద్వారా 38 ఫిర్యాదులు) అందగా, వీటిలో ఆరు మినహా మిగిలిన సమస్యలన్నింటికీ పరిష్కారమార్గం లభించింది.

ఫిర్యాదుకు అనేక మార్గాలు

సాధారణంగా అక్రమ నిర్మాణాలు, శిథిల భవనాలు, వీధుల్లో మురుగు నీరు ప్రవాహం, దెబ్బతిన్న మ్యాన్ హోళ్లు, రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు, వరదనీరు నిల్వ ఉండే ప్రాంతాలు, దోమల బెడద, కుక్కల బెడద, పారిశుధ్య లోపం, భవన నిర్మాణ వ్యర్థాల పారబోత, చెట్ల నరికివేత, రోడ్లకు అడ్డుగా ఏర్పాటు చేసిన కటౌట్ల తొలగింపు, రోడ్డు మధ్యలో ఇసుక, కంకర పోయడంతో ఎదురవుతున్న ఇబ్బందులు, విద్యుత్ కోతలు, కలుషిత జలాల సరఫరా వంటి అంశాలపై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తుంటారు. ఆఫీసు ఇన్‌వార్డులో ఫిర్యాదు ఇచ్చిన తర్వాత.. ఆ సమస్య పరిష్కారం అయ్యిందా? లేదా? తెలుసుకోవడం కష్టం. పరిపాలనలో సౌలభ్యం కోసం జీహెచ్ఎంసీ కొత్తగా ఆన్‌లైన్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. వాటిని వార్డు కార్యాలయాలకు అనుసంధానం చేసింది.

ఇంట్లో ఉండే ఫిర్యాదు చేయొచ్చు



సిటిజన్లు తమ సమస్యలను ఇంట్లో ఉండే అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకు మై జీహెచ్ఎంసీ, డయల్ 100 వంటి ఆన్‌లైన్ వేదికగా రూపొందించిన పలు యాప్‌లను ఉపయోగించుకోవాలి. వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయి సిబ్బంది మొబైల్ ఫోన్‌లకు అనుసంధానం చేస్తాం. 24 గంటల్లో సమస్యకు పరిష్కారం చూపుతున్నాం.

– యాదగిరి, వార్డు ఆఫీసర్

అండర్ వాటర్ టన్నెల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

వనస్థలిపురం: చిన్నా, పెద్ద తేడాలేకుండా కుటుంబ సభ్యులందరూ వినోదంతో పాటు ఆహ్లాదాన్ని పొందేందుకు దుబాయ్, మలేషియా, సింగపూర్, బాలి వంటి దేశాలలో ఉన్న ఫిష్ అండర్ వాటర్ టన్నెల్, ఫిష్ అక్వేరియం ఎగ్జిబిషన్‌ను వనస్థలిపురం ఆటోనగర్ లారీల అడ్డా వద్ద ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆటోనగర్ లారీ అడ్డా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ఆర్ అండర్ వాటర్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నూర్‌మహ్మద్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచిన వందల రకాల చేపలు, వివిధ రకాల ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. రూ. 100తో ఎగ్జిబిషన్‌ను చూసేందుకు అవకాశం కల్పించామని అన్నారు. మూడు నెలలపాటు రోజూ సాయంత్రం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు.

కేంద్రం నిధులతో గ్రామాల అభివృద్ధి

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

యాచారం: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటి ప్రచారం చేసి బీజేపీని బలోపేతం చేయాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో గురువారం బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషాతో కలిసి మహాజన్ సంపర్క్ యోజన ఇంటింటి కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం కిసాన్ సమ్మాన్ నిధి, ఉచిత రేషన్, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, నర్సరీలు, చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్లు, కరోనా వ్యాక్సిన్లు, ఉపాధి హామీ పనులు, సీసీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. సొమ్ము కేంద్రానిది, సోకు కేసీఆర్‌ది అన్నట్లుగా మారిందన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ఇబ్రహీంపట్నంలో బీజేపీ జెండా ఎగిరేలా సమష్టి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు టీ రవీందర్, నాయకులు యాదయ్య, రమేష్, విజయకుమార్, శాంతికుమార్, నరేష్, రాజు, కృష్ణ, శ్రీనువాస్‌రెడ్డి, శ్రీనాథ్, సంతోష్ గుప్తా, పరమేష్, శ్రీశైలం, లక్ష్మణ్, బాష, కుమార్, వెంకటేష్, శ్రీశైలం, వీరన్న, ఐల య్య, వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త అశోక్‌గౌడ్ సూచించారు. గురువారం తమిళనాడు, పుదిచ్చేరి రాష్ట్రాలకు చెందిన విస్తరక్‌లు నియోజకవర్గానికి వచ్చారు. వారికి ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ కోకన్వీనర్ నారాయణ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ యాదిరెడ్డి, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో ఇంటింట ప్రచారం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం మండలంలోని పోచారం గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు సన్మానం

తలకొండపల్లి: బీజేపీ కేంద్ర నాయకులను ఆ పార్టీ మండల అధ్యక్షుడు టీ రవిగౌడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ కుమార్ గురువారం ఘనంగా సన్మానించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు తమిళనాడు నుంచి బూత్ స్వర్ణశక్తికర అభియాన్ పనులను సమీక్షించడానికి గురువారం కల్వకుర్తి నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో ఆమనగల్లు పార్టీ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఇన్‌చార్జ్ గోరటి నర్సింహ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు శ్రమిద్దాం

ఇబ్రహీంపట్నం: రానున్న సాధారణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం పిలుపునిచ్చారు. గురువారం రాయపోల్ గ్రామ బీజేపీ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ పాత, కొత్త అనే తేడా లేకుండా పార్టీ విజయమే అంతిమ లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, ఎంపీటీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, పార్టీ బూత్ కమిటీ అధ్యక్షుడు కే అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్రామ అధికారిగా బాలమల్లేశ్

యాచారం: ఆర్టీసీ సేవలు గ్రామీణ ప్రాంతాల కు చేరువయ్యేలా ఆ సంస్థ చర్యలు చేపట్టింది. సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మర్పల్లి బాలమల్లేశ్‌ను కొత్తపల్లి, నాగిళ్ల, మొండిగౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల గ్రామాలకు బస్సు అధికారిగా నియమిస్తూ గురువారం ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ అశోక్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా గ్రామాలకు సమయానికి బస్సులు వచ్చేలా, ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా కృషి చేయనున్నారు.

శరవేగంగా ‘డబుల్’ నిర్మాణాలు

- అక్టోబర్ నాటికి అందుబాటులోకి
- రూ.11 కోట్లతో 204 ఇళ్ల నిర్మాణం
- ఎంపీ పటేల్‌గూడలో కొనసాగుతున్న పనులు



ఎంపీ పటేల్‌గూడలో నిర్మాణ దశలో డబుల్ బెడ్ రూం ఇళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు ఎంపీ పటేల్‌గూడలో శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని లింగంపల్లిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. హయత్‌నగర్, తుర్కయంజాల్ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండేళ్ల క్రితం ఆదిబట్ల మున్సిపల్ ఎంపీ పటేల్‌గూడ రెవెన్యూ పరిధిలో ఆరు ఎకరాల్లో డబుల్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 204 ఇళ్లను రూ.11 కోట్లు వ్యయంతో నిర్మిస్తున్నారు. నెల రోజులుగా పనులు ఊపందుకున్నాయి. ఆరు బ్లాకులుగా నిర్మాణాలు చేపడుతున్నారు. దాదాపు 60శాతం పనులు పూర్తి చేశారు. అక్టోబర్ లేదా నవంబర్ నాటికి ఇళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవతో పనుల్లో వేగం పుంజుకుంది.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



ఆదిబట్ల మున్సిపాలిటీలో అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి. పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం. జాబితాలో పేర్లు లేని వారికి స్థలాలు ఇచ్చి గృహలక్ష్మి పథకం అమలు చేయాలి.

– నర్సింహ, సీపీఎం నాయకుడు

త్వరితగతిన పూర్తి చేయాలి



ఎంపీ పటేల్‌గూడలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఒకే చోట 204 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే అర్హుల జాబితాను సిద్ధం చేశాం. పనులు పూర్తికాగానే లబ్ధిదారులకు అందజేస్తాం.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం